# ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి: ఆర్‌డీఓ చిన్నయ్య

**పులివెందుల,జూన్28.అక్షర టైమ్స్:-** సమాజాన్ని పోలియో రహితంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం స్థానిక పట్టణంలోని బాలిరెడ్డి మెమోరియల్ స్కూల్‌లో ప్రారంభమైంది. రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) చిన్నయ్య, జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మౌనద్దీన్, సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ చిన్నయ్య మాట్లాడుతూ ఐదేళ్లలోపు వయసున్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. భారతదేశం ఇప్పటికే పోలియో రహిత దేశంగా గుర్తింపు పొందినప్పటికీ, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్క చిన్నారి కూడా మిగలకుండా ఆరోగ్య శాఖ సిబ్బంది చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ ఖాజా మౌనద్దీన్ మాట్లాడుతూ పల్స్ పోలియో





కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు డివిజన్ వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. బస్టాండ్లు, వలస కార్మికులు నివసించే ప్రాంతాల్లో ప్రత్యేక మొబైల్ బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. మొదటి రోజు కేంద్రాలకు రాలేని చిన్నారులకు రాబోయే రెండు రోజుల పాటు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని వివరించారు. అలాగే మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. రాత్రి వేళల్లో దోమతెరలు ఉపయోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఆరోగ్య కార్యకర్త కల్పన, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# కేజీబీవీ ఉపాధ్యాయినీల సమస్యలు పరిష్కరించాలి

**కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి దేవానంద రెడ్డికి యుటియఫ్ కడప జిల్లా శాఖ వినతి**

**బద్వేల్,జూన్28.అక్షర టైమ్స్:-** కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయినీల సమస్యలను పరిష్కరించాలని కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి డి.దేవానంద రెడ్డికి యుటిఎఫ్ కడప జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది.ఆదివారం ఉదయం కేజీబీవీ పాఠశాలల కార్యదర్శి దేవానందం రెడ్డి కాశీనాయన మండలంలోని కొండ్రాజు పల్లెకు విచ్చేసిన సందర్భంగా ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు మాట్లాడుతూ కెజిబివి పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది చాలీచాలని జీతాలతో పనిచేస్తూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారికి మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని కోరారు. కడప జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో ప్రిన్సిపల్స్ మరియు టీచర్స్ గా పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగుల సేవల పునరుద్ధరణ మరియు బదిలీలకు సంబంధించిన విషయంలో గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును అనుసరించి పాత పని ప్రదేశాలలో విధుల్లోకి చేర్చుకుంటూ, తగిన ఉత్తర్వులు జారీ చేయుటకు తగు చర్యలు తీసుకొనవలసినదిగా కోరారు. అలాగే కడప జిల్లాలోని వివిధ కేజీబీవీ లలో 2025 అక్టోబర్ మాసం నుండి 2026 ఏప్రిల్ నెల చివరి పని దినం వరకు పనిచేసిన పార్ట్ టైం పీజీటీలకు మార్చి నెల వరకు మాత్రమే వేతనాలు చెల్లించడం జరిగిందని, ఏప్రిల్ నెలకు సంబంధించి వారు పనిచేసినప్పటికీ జీతాలు చెల్లించలేదని పేర్కొన్నారు. జిల్లా అధికారులు కేజీబీవీ సిబ్బందితో పని చేయించుకుని జీతాలు చెల్లించే సందర్భంలో రాష్ట్ర అధికారుల ఆదేశాలు అవసరమని కాలయాపన చేయడం తగదన్నారు. వారు



పనిచేసిన కాలానికి వేతనం చెల్లించుటకు తగు ఉత్తర్వులు ఇవ్వవలసిందిగా వారు కోరారు. అలాగే కేజీబీవీ సిబ్బందికి హెల్త్ కార్డులు మరియు ఈపిఎఫ్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వారికి ఉద్యోగ భద్రతతో పాటు పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయినీల న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కార్యదర్శి కృషి చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి డి.దేవానందరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయినీల బదిలీల విషయంలో కోర్టు తీర్పు విషయాన్ని ప్రభుత్వంతో చర్చించి, సంబంధిత ఉపాధ్యాయినీలకు తగు న్యాయం చేస్తామన్నారు. మిగతా సమస్యల పట్ల కూడా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కుర్రా చెన్నయ్య, కె.ప్రసాద్ డి.సుబ్బారావు, కె.సుధాకర్, జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్ ఓబుల్ రెడ్డి, జిల్లా మాజీ కార్యదర్శి జోజయ్య, కేజీబీవీ ఉపాధ్యాయినీలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి

**బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్**



**వేంపల్లె,జూన్28.అక్షర టైమ్స్:-** పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సంరక్షణ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఆదివారం ప్రధాన మంత్రి మన్ కీ బాత్ కార్యక్రమం అనంతరం గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోడీ 135వ మన్ కీ బాత్ కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి పలు అంశాలపై మాట్లాడారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం, నీటి సంరక్షణ వంటి కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారని అన్నారు. యువతలో ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించడం వంటి అంశాలను ప్రధాని వివరించారని తెలిపారు. స్వచ్ఛత, ఆరోగ్యం, సామాజిక బాధ్యత విషయంలో ప్రతి పౌరుడు తన వంతు పాత్ర పోషించాలని కోరారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పద్మా సురేష్, సాయి శ్రీనివాస్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి గోళ్ళ రాజేష్ కృషి అభినందనీయం

**ఘనంగా సన్మానించిన జర్నలిస్ట్ చైతన్య జ్యోతి పథకం ద్వారా మూడో విడత పింఛన్ల పంపిణీ**

**నంద్యాల,జూన్28.అక్షర టైమ్స్:-** నంద్యాల పట్టణంలో జర్నలిస్టుల సంక్షేమం ధ్యేయంగా స్థానిక నంద్యాల వాసి గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రశంసలందుకుంటున్నాయి. చైతన్య జ్యోతి పథకం ద్వారా అర్హులైన జర్నలిస్టులకు మూడో విడత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల కష్టాలను, వారి కుటుంబ పరిస్థితులను అర్థం చేసుకుని నిరంతరం అండగా నిలుస్తున్న గోళ్ళ రాజేష్‌ను జర్నలిస్ట్ రఫీ. సీఎం నాగేంద్ర హనుమంతరావు. రామారావు,ఆధ్వర్యంలో పాత్రికేయులు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే సీనియర్ పాత్రికేయుడు గోళ్ళ రాజేష్ ప్రతినిధి, నూరు భాషకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సీఎం నాగేంద్ర



మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే విలేకర్ల బాధలను, వారి ఇబ్బందులను దూరదృష్టితో ఆలోచించి ఆదుకోవడానికి ముందుకు రావడం హర్షణీయమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం కూడా చేయని విధంగా జర్నలిస్టులకు పింఛన్లు అందిస్తూ ఆర్థికంగా అండగా నిలవడం కేవలం రాజేష్‌కే సాధ్యమైందని ఆయన కొనియాడారు. పాత్రికేయ లోకం తరఫున ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పింఛన్లు అందుకున్న జర్నలిస్టులందరూ గోళ్ళ రాజేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.

# స్వగ్రామంలో మొహరం వేడుకల్లో పాల్గొన్న డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి





**బద్వేల్,జూన్28.అక్షర టైమ్స్:-** నియోజకవర్గం అట్లూరు మండలం తన స్వగ్రామమైన వేమలూరు గ్రామం లో భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా జరుగుతున్న మొహరం (పీర్ల పండుగ) వేడుకల్లో ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీర్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.బద్వేల్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మొహరం పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, మతసామరస్యం, సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఈ పవిత్ర వేడుకలు సమాజంలో శాంతి, సామరస్యాలను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వేములూరు గ్రామ ప్రజలు సూర్యనారాయణ రెడ్డి కి ఘన స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఆయన ప్రజలతో ఆప్యాయంగా మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ముస్లిం పెద్దలు, భక్తులు, స్థానిక ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో పల్స్ పోలియో కార్యక్రమం

**పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి**

**జనసేన పార్టీ పార్లమెంటు సమాచార సేకరణ కమిటీ సభ్యుడు దాసరి రవిశంకర్**

**వేంపల్లె,జూన్28.అక్షర టైమ్స్:-** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంటు సమాచార సేకరణ కమిటీ సభ్యుడు డా. దాసరి రవిశంకర్ పాల్గొన్నారు. ఉదయం నుంచి ఆసుపత్రికి వచ్చిన చిన్నారులకు వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. ఆసుపత్రి సిబ్బందితో కలిసి చిన్నారులకు ఆయన స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి నర్సులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# జూన్ 29న ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**నంద్యాల,జూన్28.అక్షర టైమ్స్:-** జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో జూన్ 29వ తేదీ (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను నేరుగా అధికారులకు సమర్పించవచ్చని, అలాగే ఎవవనశీయిఖఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందని తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చన్నారు.అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఆరోగ్య సమాజం కోసం పోలియో చుక్కలు వేయించాలి

**డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి**



**బద్వేల్,జూన్28.అక్షర టైమ్స్:-** ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా బాధ్యత గా తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి అన్నారు.బద్వేల్ పట్టణం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణం లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమం లో సూర్యనారాయణ రెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా ఈ చుక్కల మందు వేయించి,వారి భవిష్యత్తుకు రక్షణ కల్పించాలన్నారు.ప్రజారోగ్యానికి మన కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్య సిబ్బంది,పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి

**చక్రాయపేట,జూన్28.అక్షర టైమ్స్:-** ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి అతిథి అధ్యాపకులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అతిథి అధ్యాపకులకు లీప్ యాప్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, గంటల ప్రాతిపదికన కాకుండా నెలవారీగా కన్సాలిడేటెడ్ పే చెల్లించాలని వినతిపత్రంలో కోరారు. అతిథి అధ్యాపకుల జనరల్ సెక్రటరీ అంజాద్ అలీ ఆధ్వర్యంలో చక్రాయపేట, వేముల కళాశాలలకు చెందిన అధ్యాపకులు సతీష్ రెడ్డి, గంగయ్య, రాజమోహన్ రెడ్డి, సుధీర్, మమత, సుగుణ తదితరులు ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ అతిథి అధ్యాపకుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



# నిండు జీవితానికి రెండు చుక్కలు ప్రతిచిన్నారికి

# పోలియో చుక్కలు తప్పనిసరి : ఎమ్మెల్యే పార్థసారధి

**నాడీ వ్యవస్థను దెబ్బతీసే పోలియోపై అప్రమత్తంగా ఉండాలిని సూచన**

**నిర్లక్ష్యానికి తావులేదు.. పల్స్ పోలియో పై అవగాహన కల్పించిన ఎమ్మెల్యే పార్థసారథి**





**ఆదోని,జూన్28.అక్షర టైమ్స్:-** ఆదోని పట్టణంలోని అరుణ్ జ్యోతి నగర్ అర్బన్ హెల్త్ కేర్ సెంటర్ నందు ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆదోని శాసనసభ్యులు డా. పీవీ పార్థసారథి వాల్మీకి, జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశాన్ని పోలియో రహితంగా ఉంచాలంటే ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రభుత్వం చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. పోలియో వైరస్ వల్ల వచ్చే పోలియో వ్యాధి కలుషిత నీటి ద్వారా శరీరంలోకి ప్రవేశించి నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ఈ వ్యాధికి చికిత్స లేదని వ్యాక్సిన్ వేయించుకోవడమే ఏకైక రక్షణ మార్గమని అన్నారు. 2014 సంవత్సరం తర్వాత దేశంలో ఒక్క పోలియో కేసు కూడా నమోదు కాలేదని, ఈ విజయాన్ని కొనసాగించాలంటే ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రత్యేకించి తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రమం తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ, పుట్టిన నవజాతి శిశువు నుంచి ఐదేళ్ల వయసు వరకు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో నిర్మూలనలో ప్రతి కుటుంబం బాధ్యతగా పాల్గొని ప్రభుత్వ కార్యక్రమానికి సహకరించాలని, ప్రతి చిన్నారికి రెండు చుక్కలు వేయించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ, మునిసిపల్ కమీషనర్,ఎంహెచ్ఓ, అర్బన్ హెల్త్ కేర్ సెంటర్ వైద్య సిబ్బంది, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానికులు ప్రజలు పాల్గొన్నారు.

## కాశినాయనలో ఘనంగా పల్స్ పోలియో విజయ వంతం చేసిన డాక్టర్ పుష్ప



**కాశినాయన,జూన్28.అక్షరటైమ్స్:-** భవిష్యత్తు తరాలను పోలియో రహితంగా మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన 'పల్స్ పోలియో' కార్యక్రమం కడప జిల్లా కాశినాయన మండలంలో ఆదివారం అత్యంత వైభవంగా, విజయవంతంగా ప్రారంభమైంది. మండల పరిధిలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (గ్రాఎజ) ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.రెండు చుక్కలతోనే ఉజ్వల భవిష్యత్తు: డాక్టర్ పుష్ప, ఈ సందర్భంగా నరసాపురం వైద్యాధికారి డాక్టర్ పుష్ప మాట్లాడుతూ, పోలియో మహమ్మారిని సమాజం నుండి పూర్తిగా తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు."చిన్నారుల జీవితాల్లో పోలియో చీకట్లు ముసురుకోకుండా ఉండేందుకు కేవలం 'రెండు చుక్కల మందు' ఎంతో దోహదపడుతుంది. ఐదు సంవత్సరాల లోపు వయసున్న ప్రతి బిడ్డకూ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి" అని ఆమె స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా, ఉచితంగా ఈ పోలియో నివారణా చుక్కల మందును పంపిణీ చేస్తోందని ఆమె కొనియాడారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా కాశినాయన మండలంలోని అన్ని కేంద్రాలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ముందస్తు ప్రణాళికలతో, విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ పుష్ప వెల్లడించారు.వైద్య సిబ్బంది సమష్టి కృషి ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో క్షేత్రస్థాయి వైద్య, ఆరోగ్య సిబ్బంది పాత్ర ఎంతో కీలకంగా నిలిచింది. మండలంలోని ప్రతి ఒక్క చిన్నారికి పోలియో చుక్కలు అందేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు: ఈ ప్రత్యేక పల్స్ పోలియో కార్యక్రమంలో మండల హెల్త్ సూపర్‌వైజర్ బాలయ్య, సిహెచ్ఓ (CHO) నిర్మలలతో పాటు మండల పరిధిలోని ఏఎన్ఎంలు (ANMs), అంగన్‌వాడీ టీచర్లు, ఆశా (ASHA) కార్యకర్తలు మరియు ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలు అందించారు. చిన్నారుల తల్లులు, గ్రామస్తులు ఉత్సాహంగా తరలివచ్చి తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించడంతో నరసాపురం కేంద్రంగా జరిగిన ఈ కార్యక్రమం ముగిసింది.

## సామాజిక విప్లవమూర్తి శ్రీ నర్రవాడ వెంగమాంబ జీవిత చరిత్ర

**సమస్త స్త్రీ శక్తి కి ప్రతిక : రచయిత బొల్లు రామమహన్**






**పోరుమామిళ్ల,జూన్28.అక్షర టైమ్స్:-** ఆంధ్రప్రదేశ్ సామాజిక, ఆధ్యాత్మిక చరిత్రలో ఎందరో మహిళలు తమ పాతివ్రత్య మహిమ చేత, దైవభక్తి చేత గ్రామ దేవతలుగా పూజలందుకుంటున్నారు. వారిలో నెల్లూరు జిల్లాకు చెందిన నర్రవాడ వెంగమాంబ అగ్రగణ్యులు. ఆమె కేవలం ఒక పేరంటాలుగా మాత్రమే కాక, సమాజ శ్రేయస్సుకు, సంస్కరణకు, నైతిక విలువల పునరుద్ధరణకు మరియు అస్పృశ్యత నివారణకు కృషి చేసిన ఒక మహిమాన్విత శక్తి. మానవత్వం నుండి దైవత్వం ఎలా ఆవిర్భవిస్తుందో నిరూపించిన మహోన్నత తల్లి వెంగమాంబ.

**జననం – బాల్యం**

క్రీస్తు శకం 16వ శతాబ్దంలో నర్రవాడ గ్రామానికి సమీపంలో గల వడ్డీపాళెంలో పచ్చన వెంగమ నాయుడు, సాయమ్మ అనే దంపతులు నివసిస్తూ ఉండేవారు. వారు శ్రీ ఎల్లమ్మ తల్లి పరమ భక్తులు. సంతానం కోసం వారు అనేక పుణ్యక్షేత్రాలు దర్శించి, వ్రతాలు, దానధర్మాలు చేశారు. వారి నోముల పంటగా ఎల్లమ్మ తల్లి అంశతో వెంగమాంబ జన్మించింది. దివ్య శక్తులతో జన్మించిన ఆమె, పుట్టుకతోనే ప్రణవ నాదాన్ని (ఓంకారాన్ని), గాయత్రీ మంత్రాన్ని పలికింది. చిన్నతనం నుంచే ఆత్మజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ, తన నెచ్చెలి అయిన తుమ్మల పెదవేంగమ్మకు ఆధ్యాత్మిక సూత్రాలను, ఆర్య సూక్తులను బోధిస్తూ, వాటిని ఆచరణలో చూపేది. ఆమె బోధనల వల్ల గ్రామ ప్రజలు భక్తిప్రపత్తులతో, నైతిక జీవనాన్ని సాగిస్తూ చైతన్యవంతులయ్యారు.

**వివాహ జీవితం – సామాజిక సేవా దృక్పథం**

యుక్తవయస్సుకు వచ్చిన వెంగమాంబను అదే గ్రామానికి చెందిన వేమూరి అంకయ్య నాయుడు రెండవ కుమారుడైన గురవయ్యకిచ్చి వివాహం జరిపించారు. గురవయ్య సాహసవంతుడు, సౌశీల్యవంతుడు. వెంగమాంబ ఆయన సహచర్యంలో వివాహ జీవిత వైశిష్ట్యాన్ని త్రికరణ శుద్ధితో ఆచరించింది. "నా జీవితం నా కోసం కాదు, సమాజం కోసం" అని నమ్మిన వెంగమాంబ, ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా లెక్కచేయక సామాజిక శ్రేయస్సు కోసం పాటుపడింది.

**అస్పృశ్యత నివారణ:**

ప్రజలంతా సమానులని, అంటరానితనం అనేది జాతి మనుగడకు సామాజిక శాపమని బోధించింది. మానవతా విలువలు: తాగునీటి ఎద్దడితో అలమటిస్తున్న దళిత వర్గాలకు అండగా నిలబడి, మంచినీరు అందించి సామాజిక కట్టుబాట్లను ఎదిరించింది. దళిత, వెనుకబడిన వర్గాలను ఆదుకుంది.

**వీరోచిత పోరాటం – యోగాగ్ని ప్రవేశం**

రోజుల్లో నర్రవాడ ప్రాంతంలో గజదొంగల అకృత్యాలు ఎక్కువగా ఉండేవి. పురుషులు పశువుల మేపు కోసం, అమ్మకాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు.. స్త్రీలు, వృద్ధులు ఆ దొంగల నీచకృత్యాలకు బలికావాల్సి వచ్చేది. ఒకసారి గజదొంగలు గ్రామంపై పడగా, వెంగమాంబ తన ఐదవతనాన్ని సైతం లెక్కచేయక, తన భర్తను ఆయుధంగా మలచి గజదొంగల మీదికి పంపింది. సాటి మానవుల ప్రాణాలను, మహిళల మానాన్ని కాపాడటానికి గురవయ్య గజదొంగలతో వీరోచితంగా పోరాడి వారిని హతమార్చాడు. అయితే, ఒక గజదొంగ రహస్యంగా వెనుక నుండి వేసిన బల్లెం పోటుతో గురవయ్య నేలకొరిగాడు. భర్తకు మరణం తప్పదని గ్రహించిన వెంగమాంబ, తాను సుమంగళిగానే తనువు చాలించి, పేరంటాలుగా వెలసి ప్రజలను రక్షించాలని నిర్ణయించుకుంది. దళితులు స్వయంగా తయారు చేసి ఇచ్చిన నేత చీరను కట్టుకొని, భర్త చుట్టూ ప్రదక్షిణ చేసి యోగాగ్నిలో దూకి అనంతశక్తిలో ఐక్యమైపోయింది.

**దైవత్వంగా ఆవిర్భావం**

తల్లిని కోల్పోయిన బిడ్డల్లా రోదిస్తున్న ప్రజలకు అంతర్వాణి ద్వారా వెంగమాంబ ఓదార్పునిచ్చింది. "నేను ఇక్కడే దేవతగా ఆవిర్భవిస్తాను. అందుకు గుర్తుగా నా మంగళసూత్రాలు, పమిట చెంగు, మెట్టెలు, పసుపు కుంకుమలు చెక్కుచెదరకుండా అగ్నిలో నుంచి లభిస్తాయి" అని చెప్పింది. ఆమె చెప్పినట్లే ఆ వస్తువులు సురక్షితంగా లభించడంతో ప్రజలు భక్తిపారవశ్యంతో "శ్రీ వెంగమాంబ పేరంటాలకు జై" అంటూ జయజయధ్వానాలు చేశారు.

1940వ సంవత్సరంలో ఇక్కడ అమ్మవారికి ఆలయ నిర్మాణం జరిగింది. ఈ మందిరంలో భర్త గురవయ్యతో కొలువైన అమ్మవారికి ఎడమవైపున ఆమె స్నేహితురాలైన పెదవేంగమ్మ దంపతుల విగ్రహాలు, కుడివైపున వెంగమాంబ బావగారైన ముసలయ్య విగ్రహం ఉండి పూజలందుకుంటున్నాయి.

**స్థల పురాణం ఒ ఉదయగిరి నేపథ్యం**

?భగవద్గీత ప్రకారం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం భగవంతుడు మానవ రూపంలో జన్మిస్తాడు. అలాగే జగన్మాత అనేక రూపాల్లో అవతరించి లోకకళ్యాణం చేస్తుందని దేవీ భాగవతం చెబుతుంది. నర్రవాడ ప్రాంతంలో మూఢనమ్మకాలు, గజదొంగల అరాచకాలు పెరిగిపోయినప్పుడు, ప్రజల కన్నీటి ప్రార్థనలు ఆలకించి ఆదిపరాశక్తి అయిన ఎల్లమ్మ తల్లి ఇక్కడ 'శ్రీ వెంగమాంబ'గా జన్మించిందని స్థల పురాణం. ఈ క్షేత్రం చారిత్రక, ఆధ్యాత్మిక నేపథ్యం కలిగిన ఉదయగిరి దుర్గానికి ఈశాన్య దిశలో సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్రవాడ గ్రామంలో (నెల్లూరు జిల్లా, దుత్తలూరు మండలం) కొలువై ఉన్నది. ఉదయగిరి చుట్టుపక్కల ఒకప్పుడు 365 దేవాలయాలు ఉండేవని, 13వ శతాబ్దంలో కాటమరాజు తన పశువులను ఇక్కడే మేపాడని చరిత్ర చెబుతోంది.

**శ్రీ నర్రవాడ వెంగమాంబ బ్రహ్మోత్సవాలు**

ప్రతి సంవత్సరం జ్యేష్ఠ మాసంలో పౌర్ణమి వెళ్ళిన తర్వాత వచ్చే మొదటి ఆదివారం నుండి గురువారం వరకు ఐదు రోజుల పాటు అమ్మవారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి (సాధారణంగా ఇవి జూలై 5 నుండి 9వ తేదీల మధ్య వస్తాయి).

ఆదివారం: నిలుపు ఉత్సవం

సోమ, మంగళవారాలు గ్రామోత్సవం

బుధవారం: పసుపు కుంకుమ ఉత్సవం

గురువారం: పొంగళ్ళు, బండ్లు తిరుగుట, ఎడ్లచే బండ్లు లాగుడు పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమలు.

ఉత్సవాల ప్రత్యేకత:

ఈ తిరుణాళ్లకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు.

భక్తులు టన్నుల కొద్దీ ఎండు కొబ్బరిని అగ్నిగుండంలో సమర్పించడం ఇక్కడి ప్రధాన ఆకర్షణ.

ఈ ఐదు రోజుల పాటు ఈ ప్రాంత ప్రజలు ఎవరూ మాంసభక్షణ చేయరు, పూర్తిగా సాత్విక జీవనం గడుపుతారు.


**ముగింపు:**


నాయకురాలిగా, సంస్కర్తగా, మహా పతివ్రతగా జీవించి, సమాజ రక్షణ కోసం ఆత్మబలిదానం చేసిన నర్రవాడ వెంగమాంబ నేటికీ లక్షలాది మందికి ఇలవేల్పుగా, కులదైవంగా నిలిచింది. ఆమె జీవితం మానవతా విలువలకు, స్త్రీ శక్తికి ప్రతీక.

## వరుణుడు కరుణించేనా.?పంటలు పండేనా

**ఈసంత్సరం వరిపంటకు గడ్డుకాలమేనా.?**

**అన్నదాతలకు శాపంగామారిన ప్రతికూల వాతావరణం**





**కౌతాళం,జూన్28.అక్షర టైమ్స్:-** భూమిని నమ్ముకొని చెమటను చిందించి,అన్నంపెట్టే అన్నదాత గుండెల్లో మళ్లీ భయం గుబులు మొదలైంది.ప్రతీ ఏటా ఈపాటికి ఏజెన్సీ ప్రాంతంలోని వరినారుమళ్లు,పొలాలు,పచ్చని పైర్లతో కలకలాడాల్సిన పొలాలు,చెరువుల నిండి జలకలతో నిండుగా ఉండాల్సిన చెరువులు,ప్రస్తుత వాతావరణ మార్పులతో వెలవెల పోతున్నాయి.అన్నదాతలు ఆకాశంవైపు కళ్ళుకాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు.ఈ ఏడాది చూడబోతే,వరిపంటలకు గడ్డుకాలం ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది.ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే వరిపంటలకు గడ్డుకాలమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.నైరుతి రుతుపవనాలు సకాలంలో ప్రవేశించినా ఆశించినస్థాయిలో వర్షాలుకురవకపోవడంతో వరిసాగుపై తీవ్రప్రభావం చూపుతుంది.అప్పుడప్పుడు పడుతున్న చినుకులు భూమి తడవడానికే తప్ప సాగుకి పునాది వేసే పరిస్థితి లేదు.ధీంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అన్నదాతలు జూన్ నెలలో అడపాదడపా పడిన కొద్దిపాటి జల్లులకు కనీసం త్రాగేందుకు పశువులకు చెరువుల్లో నీరులేని పరిస్థితి ఏర్పడింది.భూమిలో సరైన తేమ లేనందున కొన్నిచోట్ల వరినారుమళ్లును కూడా సిద్ధం చేసే పరిస్థితిలేదు.ఇప్పటి వరకు కనీసం సగటువర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో అన్నదాతలకు తీవ్రమైన వత్తిడిలో రైతులు ఆందోళన చెందుతున్నారు.భూగర్భ జల మట్టాలు పడిపోయి అన్నదాతలకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.సరైన వర్షాలు లేకపోవడంతో రైతన్నలు నిరాశ చెందుతున్నారు.ఏది ఏమైనా పంటలు పండాలంటే పుష్కలంగా వర్షాలు కురావాల్సిందే,చుట్టూ జీవనధులు ఉన్నా ఇబ్బందులు తప్పడంలేదు.పోలవరం ప్రాజెక్టుతో బలమైన భూములు ముంపునకు గురికావడంతో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు కొట్టుమిట్టాడుతున్నారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు

**పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గురురాజు దేశాయ్**





**నందవరం,జూన్28.అక్షర టైమ్స్:-** నందవరం ప్రాథమిక అరోగ్య కేంద్రం డాక్టరు రేవతి అధ్వర్యంలో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారతీయ జనతా పార్టి జిల్లా అధికార ప్రతినిది గురురాజ్ దేశాయ్, పాల్గొని పోలియో చుక్కలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుచూ,,చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకం, ప్రతి తల్లిదండ్రులు ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని రెండు చుక్కలతో చిన్నారుల జీవితాంతం వికలాంగత్వం నుంచి కాపాడవచ్చని ఆరోగ్యవంతమైన భావితరాల కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, స్థానిక ప్రజలు, బిజెపి నాయకులు కె.శివ, బిజెపి మైనారిటి నాయకులు అబ్దుల్,దానియేలు,ఎస్ఎంసి చైర్మన్ పి.శివ మరియు సోషల్ మీడియ కన్వినర్ దండు రమేష్ పాల్గొన్నారు.

## బీసీ సామాజిక వర్గ నాయకుడు హనుమంతు గంగయ్య యాదవ్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్ అందించిన మంచూరు సూర్యనారాయణ రెడ్డి



**కలసపాడు,జూన్28.అక్షరటైమ్స్:-** బద్వేల్ నియోజకవర్గం, కలసపాడు మండలం, ఎగువ తంబళ్లపల్లె గ్రామానికి చెందిన బీసీ సామాజిక వర్గ నాయకుడు హనుమంతు గంగయ్య యాదవ్ కు అనారోగ్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.40,365/- (నలభై వేల మూడు వందల అరవై ఐదు రూపాయలు) విలువైన చెక్కును ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి వాటి ప్రయోజనాలను పొందాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించడంలో తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## చిన్న కప్పలపల్లిలో విందు కార్యక్రము లలో పాల్గొన్న నల్లేరు విశ్వనాథ రెడ్డి





**పోరుమామిళ్ల,జూన్28.అక్షర టైమ్స్:-** బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న కప్పలపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ పట్టాభిరామస్వామి ధ్వజ ప్రతిష్ఠ, అలాగే సత్తెమ్మ తల్లి, పోతురాజు సమేత పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఆ మహోత్సవం జరిగి 41 రోజులు పూర్తైన సందర్భంగా గ్రామ పెద్దలు, నాయకులు, ప్రజలు ఆహ్వానించగా వారు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ వైస్సార్సీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నల్లేరు విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ, చిన్న కప్పలపల్లి గ్రామ ప్రజలు, నాయకులు తనపై చూపుతున్న ప్రేమాభిమానాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొనడం జరిగినది.

## 38వ డివిజన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సార్ హెల్ప్ డెస్క్




**కడప/నగరం, జూన్ 28. అక్షర టైమ్స్:-** కడప నగరంలోని 38వ డివిజన్‌లో కడప నగర కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ గౌస్ పీర్ ఆధ్వర్యంలో సార్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయబడింది.ఈ సందర్భంగా ప్రజలకు సార్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన సమాచారం అందించడంతో పాటు ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో కూడా సహాయం అందించారు.ఈ సందర్భంగా సయ్యద్ గౌస్ పీర్ మాట్లాడుతూ, కడప నగరంలోని ప్రతి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన సార్ హెల్ప్ డెస్క్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సరిచేసుకోవడం, డూప్లికేట్ ఓట్లను తొలగించడం, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవడం ద్వారా ఎన్నికల వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షులు జి.వి. అంజన్ కుమార్, సౌదాగర్ సాదిక్, అలాగే షేక్ అన్వర్, సిద్ధిక్, మురాద్ భాయ్, సర్దార్, జమీల్, హమీదా ఖానం, మహబూబ్ బాషా, నాసిర్ ఖాన్, ఆరిఫ్, రహమతుల్లా, సుబ్రహ్మణ్యం, సిద్దిక్ తదితరులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.